క్లుప్తంగా

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సెయింట్ పాల్స్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో పాల్గొనని ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించి పీఓలు, ఏపీఓలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవీఎంలు సక్రమంగా పని చేస్తున్నాయా లేదా అని ఒకటికి రెండు సార్లు పరిశీలించుకుని పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణలో నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని అనుసరించి వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ ఎటువంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటింగ్ ప్రశాంతంగా ముగిసేలా అన్ని విధాలా ప్రయత్నించాలన్నారు. ఈసీ ఆదేశాలను సారంగా ప్రతి ఒక్కరూ విధులు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈవీఎంను తీసుకెళ్తున్న ప్రతి ఒక్క అధికారి ఎంతో జాగ్రత్తగా వాటిని చూసుకోవాలన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత వాటిని స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చడం వరకు మీరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఆర్వో డి.నాగజ్యోతి, అసిస్టెంట్ ఆర్వోలు సిద్ధార్థ్, వి.శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు

దొనకొండ: పల్లెల్లో నేడు జరుగుతున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహం చూపుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దామంటూ మహిళలు సైతం పల్లెల్లో ఉత్సాహంగా ఉన్నారు. బూచేపల్లి కుటుంబంపై అభిమానం, ఆప్యాయత, ప్రేమానురాగం ఉప్పొంగిపోతోంది. మా శివన్నను గెలిపించుకుంటే మా ఊరిని అభివృద్ధి చేస్తాడంటూ ప్రతి ఒక్కరి నోటా అదే మాట. ఏ పల్లెకు పోయినా, ఏ వార్డుకు పోయినా మా శివన్న అంటూ మా ఓటు ఫ్యాను గుర్తుకే వేస్తామంటున్నారు. 2019లో మండలంలో వచ్చిన మెజార్టీ కన్నా రెట్టింపు తేవడానికి మహిళలు, పింఛన్‌దారులు, వృద్ధులు, యువకులు సైతం ముందుకు వస్తున్నారు. 20 సంవత్సరాల నుంచి మేము బూచేపల్లి కుటుంబంతో ఉంటున్నామని, వారు మాలో ఒకరుగా ఉంటున్నారని, ఏ పల్లెకు పోయినా అదే మాట. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాలను పలకరించినా తమకు బూచేపల్లి కుటుంబం రావాలి, వారి కోసం తాము ఏమైనా చేస్తామంటున్నారు. మాకు శివన్న అంటే ఇష్టం. మా ఓటు ఫ్యాను గుర్తుకే వేస్తామంటున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మెనిఫెస్టో నూరు శాతం అమలు చేసి సంక్షేమ పథకాలను నేరుగా ఇంటికే అందజేసిన జగనన్న సువర్ణ పాలన మళ్లీ కావలంటున్నారు. ఏ తాత, అవ్వ, అక్కా, చెల్లి, అన్నా తమ్ముడిని అడిగినా జగనన్నకే తమ ఓటు వేస్తామన్నారు. శివన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని జగనన్నకు కానుకగా అందజేస్తామని మండల వైఎస్సార్ సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ముక్త కంఠంతో చెప్తున్నారు.

దర్శిలో ఎన్నికలకు సర్వం సిద్ధం

దర్శి: నేడు జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. దర్శిలో 282 పోలింగ్ కేంద్రాలు, 177 లొకేషన్‌లలో పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ నిర్వహణకు ఆర్వో లోకేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. డీఎస్పీ అశోక్‌వర్ధన్ పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఒక అడిషనల్ ఎస్పీ, ఇద్దరు ట్రైనీ ఐపీఎస్‌లు, ఒక డీఎస్పీ, ఎనిమిది మంది సీఐలు, 12 మంది ఎస్సైలు ఎన్నికల పర్యవేక్షణలో పాల్గొననున్నారు. 600 మంది పోలీస్ సిబ్బంది, ఇతర బలగాలు ఎన్నికలు నిర్వహణలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆర్వో లోకేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక మోడల్ స్కూల్ నుంచి ఆదివారం ఈవీఎంలను ప్రత్యేక వాహనాల్లో బందోబస్తుతో గ్రామాలకు తరలించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటకు క్యూలో ఉన్న వారు ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. 6 గంటల తర్వాత వచ్చే వారికి మాత్రం ఓటు వేసే అవకాశం లేదు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

యర్రగొండపాలెం: పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఆయా పోలింగ్ బూత్‌లకు కావలసిన సామగ్రి, సిబ్బందిని కేటాయించారు. సిబ్బంది పోలింగ్‌కు అవసరమయ్యే ఈవీఎంలను తీసుకొని వెళ్లారు. జిల్లాలోనే మొదటి పోలింగ్ బూత్ అయిన పాలుట్లకు సిబ్బంది తరలి వెళ్లారు. వీరు దట్టమైన నల్లమల అడవిలో ప్రయాణించి రాత్రి 9 గంటల ప్రాంతంలో అక్కడికి చేరుతారు. నియోజకవర్గంలో మొత్తం 265 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందుకుగాను 1590 మంది సిబ్బందిని కేటాయించారు. నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 207214 ఉండగా పురుషులు 105230 మంది, స్త్రీలు 101982 మంది ఉన్నారు. యర్రగొండపాలెం మండలంలో 48704 మంది ఓటర్లు 59 బూత్‌లలో, పుల్లలచెరువు మండలంలో 42065 మందిగాను 53 బూత్‌లు, త్రిపురాంతకం మండలంలో 48836 మందికి 66 బూత్, పెద్దారవీడు మండలంలో 33854 మందికి 42 బూత్‌లు, పెద్దదోర్నాల మండలంలో 33755 మందికి గాను 45 బూత్‌లు కేటాయించారు.

పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన సిబ్బంది

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలో నేడు జరిగే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటరైన ఎస్‌వీకేపీ కళాశాల ప్రాంగణానికి ఉదయం 10 గంటల నుంచే సిబ్బంది చేరుకుని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల వివరాలు చూసుకొని సామగ్రిని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ద్వారా అందుకున్నారు. మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సిబ్బందితో పాటు పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఓ రాహుల్‌మీనా, డీఎస్పీ బాల సుందరరావు మాట్లాడుతూ సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లి ఎన్నికలు సజావుగా జరిపించాలని సూచించారు. గొడవలు, అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్స్, వాటర్ బాటిల్స్ అనుమతించమన్నారు. పోలింగ్ సిబ్బందికి ఓటర్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నియోజకవర్గ వ్యాప్తంగా..

కొనకనమిట్లలో మొత్తం 46 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం 38,072 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మార్కాపురం రూరల్‌లో 41,207 మంది, మార్కాపురం టౌన్‌లో 55,305 మంది, తర్లుపాడులో 25,936 మంది, పొదిలి రూరల్‌లో 22,283 మంది, పొదిలి నగర పంచాయితీలో 29,267 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌కు సాయుధ పోలీసులను నియమించారు. ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రానికే తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లారు.



ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

నేటి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన ఆర్ఓ రాహుల్ మీనా

- మార్కాపురంలో కలెక్టర్ దినేష్‌కుమార్ పర్యటన

మార్కాపురం: నేడు జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మార్కాపురంలోని ఎస్‌వీకేపీ కళాశాలలో పోలింగ్ సిబ్బందికి అందజేసే ఈవీఎంలు, ఇతర సామగ్రిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ చెక్ లిస్టుల ప్రకారం సామగ్రి పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆధారాలు చూపకుండా అనారోగ్యం, ఇతర సాకులతో ఎన్నికల విధులకు హాజరుకాని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లో వెళ్లే సిబ్బందికి అన్నీ వసతులు కల్పించామన్నారు. ఏ అవసరం వచ్చినా బీఎల్ఓలు, సెక్టారు ఆఫీసర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నియోజకవర్గంలో మొత్తం 257 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 2,14,608 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. 68 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికలకు సంబంధించి 48 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. 140 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేశారు. దాదాపు 3 వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. సాయుధ పోలీసు బందోబస్తుతో ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మార్కాపురం ఆర్ఓ రాహుల్ మీనా, డీవైఎస్పీ బాల సుందరరావు సూచించారు.

పల్లెల్లో..ప్రగతి మల్లెలు!



కొనకనమిట్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



నాయుడుపేట రోడ్డు

- అభివృద్ధి పథంలో కొనకనమిట్ల మండలం
- ఐదేళ్లలో రూ.240 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు



చినమనగుండంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్

కొనకనమిట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పల్లెలను ప్రగతి బాట పట్టించి గ్రామీణులకు మెరుగైన మౌలిక వసతులు కలిపించారు. ప్రతి గ్రామానికి సంక్షేమ పథకాలు అందించేందుకు బీటీ, నాన్ బీటీ ద్వారా రూ.కోట్లలో ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుత మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి సహకారంతో కొనకనమిట్ల మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు సుమారు రూ.240 కోట్ల మేర ఖర్చు చేశారు. 26 పంచాయతీల్లో నవరత్నాల పథకాలతో పాటు వైఎస్సార్ ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం పథకాల ద్వారా అదనంగా మరికొన్ని కోట్ల రూపాయలు అర్హులకు లబ్ధి చేకూరింది. వీటితో పాటు జగనన్న కాలనీలు, ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు వేశారు. నాడు-నేడు ద్వారా రెండు విడతల్లో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యార్థుల చదువే లక్ష్యంగా వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. ఈ ఏడాది పలు గ్రామాల్లో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి మంచినీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి చిహ్నంగా గ్రామాల్లో ప్రగతి మల్లెలు విరబూస్తున్నాయి. గ్రామాభివృద్ధే లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమం అందించేందుకు గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు ఏర్పాటు చేసి వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి తావులేకుండా పారదర్శకంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోంది. ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయాలు వేదికగా మారడంతో పాటు సంక్షేమ పథకాల పంపిణీలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రజారోగ్యమే లక్ష్యంగా కొనకనమిట్లలో రూ.1.60 కోట్లతో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. కొనకనమిట్ల వయా కాట్రగుంట మీదుగా నాగంపల్లి వరకు 13 కి.మీ మేర రూ.కోట్లతో తారు రోడ్డుతో పాటు గొట్లగట్టు నుంచి నాయుడుపేట వరకు రెండు కి.మీ మేర రూ.70 లక్షలతో రోడ్డు నిర్మించారు. అంతే కాకుండా ఇటీవల మునగపాడు వయా మంగాపురం మీదుగా పొదిలి మండలం కొండాయపాలెం వరకు రూ.67 లక్షలతో తారు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేలా ప్రణాళికలు రూపొందించిన ముఖ్యంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు నూటికి నూరుశాతం మార్కులు పల్లె ప్రజలు వేస్తుండటం గమనార్హం.



ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు



గొట్లగట్టులోని జగనన్న కాలనీ



పాతపాడులో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే



కొనకనమిట్ల ఏపీ పాఠశాలలో..

గిద్దలూరులో ఎన్నికల ఏర్పాట్లు సర్వం సిద్ధం



ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్ ఆర్వో సిద్ధార్థ్

గిద్దలూరు రూరల్: ఎన్నికల కోసం పట్టణంలోని సెయింట్ పాల్స్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో అధికారులు ఏర్పాట్లను సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ఈవీఎంలను స్కూల్ ఆవరణలో ఉంచి అధికారులకు కేటాయించారు. పీఓలు, ఏపీఓలకు కేటాయించిన ఈవీఎంలతో సాయంత్రం కల్లా వారు పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో సహా వెళ్లేందుకు ప్రత్యేక వాహనాలు సిద్ధం చేశారు. అనారోగ్య సమస్యలు ఉన్నా, వికలాంగులైన, చంటిబిడ్డల తల్లులైన సరే వారిని సైతం ఎన్నికల విధుల్లోకి తీసుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 284 పోలింగ్ కేంద్రాలు, 39 సెక్టార్లు, పీఓలు, ఏపీఓలు 1704 మంది, మైక్రో అభ్యర్థులు 42 మంది, వెబ్‌క్యాస్టింగ్ 168 మంది, వీడియో గ్రాఫర్లు 36 మంది, మాజీ సైనికులు పోలీసులకు భద్రత విషయంలో సహాయం పడేందుకు 90 మంది పాల్గొంటున్నారు. భద్రత ఏర్పాట్లను పరిశీలించేందుకు దిశ డీఎస్పీ శ్రీనివాస్ పోలీస్ సిబ్బందితో పాటు ఎన్‌సీసీ విద్యార్థులు, మాజీసైనికులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణలో నిర్వహించేందుకు ఓటరుకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్వో డి.నాగజ్యోతి తెలిపారు.



చంటి బిడ్డతో విధులకు వస్తున్న ఉద్యోగి



ఎన్నికల విధుల్లో దివ్యాంగురాలైన సచివాలయ ఉద్యోగి

ఓటేసేందుకు..పట్నం నుంచి పల్లెలకు!



ఒంగోలు-గిద్దలూరు రహదారిపై గొట్లగట్టు వద్ద ఇలా..

కొనకనమిట్ల: నేడు సార్వత్రిక ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నాయి. తమ అభిమాన నాయకుడికి ఓటేసేందుకు ఓటర్లు పట్నం నుంచి పల్లెలకు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. పలువురు అయితే ముందుగానే గ్రామాలకు చేరుకోగా కొందరు ఆదివారం చేరుకున్నారు. బస్సుల్లో ఖాళీ లేక కొంత మంది ట్రావెల్ బస్సులు, కార్లు, ఆటోల్లో వస్తున్నారు. ఆదివారం ఏ రహదారి చూసిన వాహనాలతో రద్దీ కనిపించింది. ఒంగోలు-గిద్దలూరు రహదారిలో అధిక సంఖ్యలో ఓటర్లు కార్లలో వెళ్తూ కనిపించారు. ఓటు వేసేందుకు ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లు గ్రామాలకు చేరుకోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో సందడి నెలకొంది.



మరో మార్గంలో ఇలా..

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. పోలేరమ్మ తల్లి భక్తులను చల్లంగా చూడాలని అమ్మవారికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందింది. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో ఆదిశంకరాచార్యుల జయంతి



పూజలు చేస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: జగద్గురు ఆది శంకరాచార్య జయంతిని ఆదివారం మార్కాపురం పట్టణంలోని శ్రీ మార్కండేశ్వరస్వామి దేవాలయం (శివాలయం)లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదిశంకరాచార్య విగ్రహానికి అర్చకులు సోమయాజుల హరిప్రసాద్, వరుణ్‌కుమార్ శర్మ తదితరులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవానికి మార్కాపురం పట్టణంతో పాటు సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో బ్రాహ్మణులు హాజరయ్యారు. అనంతరం అన్న సంతర్పణ జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులను సన్మానించారు. ఆలయ చైర్మన్ వి.కేశవశర్మ, సోమయాజులు సుబ్బశాస్త్రి, గోపాలుని హరిహరరావు, రెంటచింతల మధుసూదన శర్మ, భారతుల మారుతీ శశిధర్, కలవలపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, బీకే అర్జునరావు, జీఎల్ రమేష్ బాబు, పి.అనంత శివకుమార్ శర్మ, ఆడిటర్ నాగరాజు తదితరులు హాజరయ్యారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని ఊరేగించారు.

వైఎస్సార్ సీపీలోకి 20 కుటుంబాల చేరిక



టీడీపీ వారిని వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న వైస్ చైర్మన్ ఇస్మాయిల్, పక్కన శ్రీనివాసులు

మార్కాపురం రూరల్: తమ ఇష్టం మేరకే వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీ 13వ బ్లాక్‌కు చెందిన పలువురు తెలిపారు. ఆదివారం టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి 20 కుటుంబాలు మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో చేరాయి. పార్టీలో సాయికుమార్, జలకూరి నరసింహ, దాసరి యుగంధర్, వెంకటరామిరెడ్డి, దాసరి హరి, షేక్ మహ్మద్, సాయితేజ, ముఫీజ్, శివ, మాలిక్, డి.వాసు తదితరులు చేరారు. ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్, కౌన్సిలర్ షెక్షావలి, పీఎంసీ చైర్మన్ కరీముల్లా, ఈద్గా అధ్యక్షుడు షేక్ బిలాల్, మొతుకూరి రామిరెడ్డి ఉన్నారు.